# మగవాడు - ఆడమనిషి

**శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి**

జీవితంలో నాలుగురోడ్ల జంక్షన్ దగ్గరకు వచ్చి ఎటుపోవాలో ఎరక్క అటూ ఇటూ చూస్తోన్న మూర్తి ఒకరోజున నిల్చున్నాడు మద్రాస్‌లో, మైలాపూర్లో, నాలుగురోడ్ల జంక్షన్లో, బస్సుస్టాండ్ దగ్గర్నే.

మూర్తిలో యవ్వనం ప్రవేశించింది.

కాని ఇంకా పోలేదు బాల్యం అతన్లోంచి.

అతణ్ణీ, అతడితోపాటు బస్ కోసం 'వెయిట్' చేస్తోన్న ఇంకో పదిహేను మందినీ మాడ్చి చంపుతోంది చెన్నపట్నపు ఎండ.

కావలసింది తప్పించి మిగతా బస్సులన్నీ వస్తున్నట్టున్నాయి. వచ్చినవన్నీ వెళిపోతున్నాయి.

ఎండ కాల్చి చంపుతూ నేవుంది.

మూర్తికి చిరాగ్గా ఉంటూ నేవుంది.

బస్సులకోసం కాసు కూర్చోడం, బస్సుల్లో నలిగిపోతూ నిల్చోడం, ట్రాముల కెక్కబాకడం, రిక్షాల్లో తూలిపోతో పోవడం, ఎలక్ట్రిక్ ట్రెయిన్లో నలిగిపోవడం, అందరి కాళ్ళూ పట్టుకొందికి తిరగడం తిరగడం—

ఇలా జరిగిపోతోంది కాలం.

"ఉద్యోగంలేదు, సద్యోగంలేదు. ఈ వూళ్ళో ఏదీ దొరికేట్టులేదు. ఆఖరికి మంచినీటి చుక్కలయినా దొరకడం లేదు" అనుకున్నాడు రాని బస్సుకోసం నిరీక్షిస్తోన్న మూర్తి.

దువ్వుకున్న జుత్తు దువ్వకోనట్టుగా వుంది. చొక్కా నలిగింది, మాసింది. పైజామా ఒక్కచోటే చిరిగింది.

లోకం అంతా ఆ చిరుగువైపే చూస్తున్నట్టు బాధపడుతున్నాడు మూర్తి.

ఒంటిమీద సరయిన బట్టలేదు. చేతిలో పుష్కలంగా డబ్బులేదు. నోట్లో తప్పులేని ఇంగ్లీషుముక్క లేదు. ఎవడు చూస్తాడీ వూళ్లో నన్ను!!

ఉద్యోగంకోసం రామయ్యగార్ని చూద్దామని వస్తే ఆయన సుఖమైన వసతి కోసం ఎగూర్కరు పోయారట.

రేపు అక్కడికి పోవాలి. ఇప్పుడు అప్లికేషన్ రుసుం చెల్లించడానికి గవర్నమెంటు వారి ఖజానాకి పోవాలి.

పోదల్చుకొన్న చోటుకి పోయే బస్సులు రావడం లేదు. వస్తే ఆగడం లేదు.

నే చస్తే ఈరోజున ట్రామెక్కను.

చిరాగ్గా నిల్చున్న మూర్తి విసుగ్గా అందరివైపూ చూసేడు. బస్సుకోసం చాలా మంది నిల్చున్నారు. అరవ ఫక్కీలో ఆరుగురు జరీ అంచు ధోవతులు కట్టుకొన్నారు. యూరపియన్ ఫక్కీలో, ఇద్దరు వులెన్ సూట్లు వేసుకొని లేని దర్జా తెచ్చుకోబోతున్నారు. ఒకే గొడుగు నీడని నిల్చొన్న ఇద్దరాడవాళ్ళూ ఎందుకోగాని తెగ నవ్వుతున్నారు. కాలేజ్ స్టూడెంట్లా కనిపించే ఆడమనిషి పొడవుగా ఉన్నాననే గర్వంతో పొడవుగా నిల్చొంది. మూర్తి దృష్టి ఆమె మీదపడి ఆమెమీదే ఉండిపోయింది. ఆమె ముఖం తీరూ, మేనిఛాయా, చీర సొగసూ గుర్తించాక దృష్టి పడింది ఆమె చేతిలో వున్న పుస్తకాలమీద.

ఆడవాళ్లు చదివేస్తున్నారు బియ్యేలూ ఎమ్మేలూ!!

ఆవిడ బస్సెక్కి కాలేజీకి వెళ్తుంది: నేను బస్సెక్కి ఖజానాకి పోవాలి.

ఏదో బస్సు వస్తోంది! ఆమెమీంచి కళ్లు తీసేశాడు మూర్తి. బస్ ఇంకా దూరంలోనే వుంది.

"మిస్టర్ మిస్టర్" అని ఎవరో ఎవర్నో పిల్చేరు. అటు తిరిగేడు మూర్తి.

రంగుల గొడుగుకింద నిల్చొన్న కాలేజీ స్టూడెంట్లా కనిపించే పడుచు దగ్గరగా రమ్మంది, మూర్తిని. మూర్తి ఆశ్చర్యపోలేదు.

నిర్ఘాంతపోయేడు. కొంచెం తేరుకొని దగ్గరగా వెళ్లేడు.

మాసిన చొక్కా ఇంకా మాసింది. చిరిగిన పైజామా ఇంకా చిరిగింది. కొట్టుకొనే గుండెలు ఇంకా కొట్టుకొంటున్నాయి. ఆవిడ తొందరపాటుతో మాట్లాడుతోంది.

"క్షమించి మరోవిధంగా అనుకోకండి. కాని అదిగో బస్ వచ్చేస్తోంది. ఈ వుత్తరం అర్జంటుగా పోస్ట్ చెయ్యాలి. ఇంతవరకూ మర్చిపోయేను. టైమయిపోతోంది. పోస్టు బాక్సు అదిగో అల్లక్కడే ఉంది. దయచేసి అందులో పడేద్దురూ" అందామె మూర్తితో, ఆత్రతతో, ఇంగ్లీషులో.

ఉత్తరం యేదో పోస్టు చెయ్యమంటోందని మాత్రం గ్రహించేడు మూర్తి.

పుస్తకం మధ్యనుంచి కవరుతీసి మూర్తి చేతి కిచ్చిందామె, 'పోస్టు చెయ్యక ఏం చేస్తావ్' అనేధీమాతో.

నా బస్సుకూడా నీబస్సు వెనకే వస్తోంది. అందులో పోయి నేను ఉద్యోగంకోసం ఖజానాలో డబ్బు కట్టాలి. ఆ బస్సు మించిపోతే ఇంకోటి వచ్చేట్టులేదు. రాకపోతే ఎండలో నిల్చొని చావాలి. ఈ వుత్తరం ఇంత అర్జంటా? తరవాత ఎందుకు పడేసుకోగూడదు? మెయిల్ కి సాయంకాలం వరకూ వేళవుంది కదా అనే మాటలు అందామనే తోచలేదు మూర్తికి.

చుట్టూ నిల్చొన్న మొగాళ్లంతా "ఏవ దృష్టం, ఏవ దృష్టం" అన్నట్టుగా చూస్తున్నారు.

ఆమె వైపూ వాళ్లవైపూ చూసి తపాలా పెట్టెవైపు నడిచేడు మూర్తి. నడుస్తూ నడుస్తూ కవరుమీద అడ్రస్ చూసేడు.

కలకత్తాలో, ఏదో నంబర్న ఏదో వీధిలో ఉండే "అనిల్ కుమార్" అనే వాడికి "మోహిని, మద్రాస్"నుంచి వెళ్తోందా వుత్తరం.

అడ్రెస్ చదవడం తప్పేమో, ఆవిడ దూషిందేమో అనే అనుమానంతో వెనక్కి తిరిగిచూసేడు. వేగిరం వెళ్లమని సంజ్ఞ చేసిందావిడ.

ఏకంగా పరుగే తీసేడు మూర్తి.

తపాలా తీయడానికి బంట్రోతు వచ్చేడు. వగర్చుకొంటూ వెళ్లి ఉత్తరం అందజేసేడెలాగయితేనేం మూర్తి అతడికి. ఉత్తరం ఇచ్చేశాక వెనక్కి తిరిగేడు.

కదుల్తోన్న బస్సుగుమ్మంలో నిల్చొని ముడిచిన రంగుల గొడుగు చంకన పెట్టి రుమాలు వూపిందావిడ మూర్తిని చూస్తో. ఏం చెయ్యాలో తోచని మూర్తి రెండు చేతులూ ఊపేశాడు.

బస్సు దూరంగా పోయింది. ఆమె గుమ్మంలోంచి బస్సులోకి పోయింది.

ఈవిడే కాబోలు మోహిని!!

ఎక్కడ వుంటోంది? ఏమిటి చదువుతోంది?

అనిల్ కుమారు దెవరు? ఈవిడకీ వాడికీ ఉన్న సంబంధం ఏమిటి?

"ఎందుకోగాని ఈవిణ్ణి చూస్తే నాకు ఎంతో ఇష్టంగావుంది" అనుకున్నాడు మూర్తి.

'అనిల్ కుమార్'ని తల్చుకొంటే ఇష్టంగా లేదు.

"అనిల్ కుమారేమిటి అనిల్ కుమారు? పోకు పేరు. ఎందుకూ పనికిరాని పోకిల్రాయళ్ళు పెట్టుకొనే పాడుపేరు." అనిల్ కుమార్‌కి ఆవిడ ఉత్తరం రాసినందుకు విచారించినా తనచేత ఆవిడ ఆ ఉత్తరాన్ని పోస్ట్ చేయించినందుకు గొప్పపడిపోయేడు మూర్తి.

తన బస్సు పోయినందుకు మూర్తి విచారించనే లేదు. ఏదో ఘనకార్యం చేసినట్టుగా, ఎంతో సంతోషంతో, సంతృప్తితో మరో బస్సులో బైలాయించేడు మరో అరగంటకి. తరువాత డబ్బు కట్టడానికి ఖజానాలో ఉన్నంతసేపూ, తిరిగి యింటికి పాతమాంబళం వెళ్తున్నంతసేపూ, మధ్యాహ్నం ఇంట్లో ఉన్నంతసేపూ, సాయంకాలం పానగల్ పార్కులో కూర్చున్నంతసేపూ మోహిని గురించే, ఆమె గురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు.

ఆలోచిస్తూంటే సుఖంగావుంది.

అంతా ఏదో కొత్తగా కనిపిస్తోంది.


ఉద్యోగం దొరకని, మంచినీళ్ళయినా దొరకని చెన్నపట్నం పాడు పట్నంలా కనిపించడం లేదు.

కంపుకొట్టే పాతమాంబళం సందూ, మూడు గదుల మేనమామ యిల్లూ, ఎప్పుడూ మాసిన గడ్డంతో వుండే మేనమామా, చస్తేనే గాని పోని స్ఫోటకంమచ్చల మేనత్తా, ఎప్పుడూ తనతో ఆమె, ఆమెతో తను మాట్లాడ్డానికి సందేహించే పదహారేళ్ళ మరదలు వరహాలూ, అన్నీ, అంతా ఎంతో అందంగా, ఆనందంగా మూర్తికి కనిపించేయి, కనిపించేరు. రాత్రి మేనమామ ఎందుచేతనోగాని ఎక్కడికో వెళ్లేడు అప్పుడప్పుడే. చింతమొద్దులా పడుకొంది మేనత్త అప్పుడే.

"నేను నిద్రపోతాను. నాన్నగారికి తలుపు తియ్యాలి ఎవరో పకరు" అంది పక్కగదిలో వున్న వరహాలు మూర్తికి వినిపించేలా.

ఇది నన్ను ముద్దుగా "బావా" అని ఎందుకు పిలవకూడదు? అనుకున్నాడు మూర్తి.

మూర్తికి ఆవేశంగా వుంది. ఉత్సాహంగా వుంది. గర్వంగా వుంది.



"అయితే వెంటనే వెళ్లి వాళ్లిద్దర్నీ చితకతన్ను వేగిరం... వేగిరం..."

"వరహాలూ! ఇలా రా" అన్నాడు మెల్లిగా, అత్తని లేపకుండా, వరహాలుకి వినిపించేలా.

మెల్లిగా ఉచ్చరించినప్పటికీ మాటల్లో అధారిటీ కనిపిస్తోంది, వినిపిస్తోంది.

"ఇలారా వరహాలూ!"

ఇంతకాలం పలకరించడానికి భయపడ్డ వాణ్ణి ఇవాళ దీన్ని ఎలా పిలుస్తున్నాను?! మారుమాటాడకుండా ఎలా వచ్చిందీ వరహాలు పిలవగానే?!

"ఎందుకు బావా?"

"ఇందుకు"

చుట్టూ చేతులు వేస్తే ఎందుచేత ఊరుకొందీ వరహాలు?!

కొత్తగా ఆడదాన్ని అదుముకొన్న మైకంలో కళ్లు మూసి "మోహినీ! మోహినీ!" అన్నాడు అస్పష్టంగా.

వరహాలు కూడా అంతా కొత్తే అయినప్పటికీ "మోహి నెవరు?" అని అడిగింది ఆడదాని అప్రమత్తతతో.

"నువ్వే! మోహిన్లా ఉన్నావ్" అన్నాడు మూర్తి, ఒక్కసారిగా తెలివి

ఆపట్టణంలో మహిళా సంఘ సహాయార్థం సభ్యురాండ్రందరూ కలిసి ఒకవేలంపాట నడుపదలిచారు. ఆవిషయాన్ని ఎరుక పరుస్తూ పూరిలోని అమ్మలక్కలకందరికీ దిగువ విధంగా నోటీసులు పంపించారు "...ఇంట్లో అట్టే పెట్టుకోవటానికి చోటు దండుగ అయిన వస్తువులు ఏవివున్నారే మాకు అప్పగించండి. వాటినే అమ్ముకొని మన సంస్థకు నిధి సేకరిద్దాము. పై ఆదివారం నాటికి మీకు పనికిరాని వస్తువులన్నీ మీకు అందచేయండి. మీ భర్తలను కూడా తీసుకురండి."

తెచ్చుకొని, అలాటి సమయాల్లో మొగవాడికి ఉండే అబద్ధపు సైజంతో.

ఇంతలో మామయ్య తలుపు తట్టడం జరిగింది.

రాత్రి పడుకొనేముందు మూర్తి కళ్లముందు మెరిసింది, మద్రాస్ ఎండలో రంగుల గొడుగు నీడని నిల్చున్న మోహిని. రాత్రంతా కలల్లేని నిద్రపోయేడు.

మర్నాడు అన్నాడు మామయ్య.

"మరయితే డబ్బెలానూ కట్టి అప్లికేషను పడేశావుకదా! ఎగ్మూరు పోయి ఆ రామయ్యగారి కూడా ఓసారి కనిపించు. దర్శనం చేసి బతిమాల్తే ఏదైనా సాయం చేస్తాడాయన."

ఎగ్మూరు వెళ్ళి రామయ్యని చూడాలని లేనేలేదు మూర్తికి. మైలాపూర్ పోయి మోహిని కనిపిస్తుందేమో చూడాలని వుంది.

"సరే" అన్నాడు.

రెండేళ్ళు కష్టపడి చదివి స్కూల్ ఫైనల్ సాధించి ఇంటర్మీడియేట్ చదువుదామని ఉబలాటపడుతూవుంటే, "మీ మావదగ్గరకి పోతే అతనేవయినా ఉద్యోగం ఇప్పిస్తాడు. వెళ్లు వెళ్లు, మెడ్రాస్ వెళ్లు" అన్నాడు నాన్న.

దాన్తో పై చదువుకి వెళ్దామన్న సరదా అలానే వుండిపోయింది. మద్రాస్ చూద్దామనే సరదాతో మద్రాస్ వచ్చి రావడంలో ఆ సరదా తీరిపోయింది.

పాతమాంబళంలో పగలే చీకటిగా ఉండే గదిలో కూర్చొని "ఛీ, పాడుపూరు. పాడు పెధవ్వూరు. పనికిమాలిన వూరు" అని మద్రాస్‌ని నిందించుకున్నాడు మూర్తి.

ఇంతవూళ్లోనూ యాభైరూపాయిలిచ్చే ఉద్యోగంకూడా దొరకదు. దొరికినా, ఆ జీతం బతకడానికి చాలదు. అదయినా లక్షాయాభైమంది కాళ్లుపట్టుకొంటేనేగాని దొరకదు. కాళ్లుపట్టుకోడానికి రోజుకి అధమం పదిమైళ్లయినా తిరిగి తిరిగి చావాలి.

ఎగ్మూరు వెళ్తానని చెప్పి మైలాపూర్‌కి బయల్దేరిన మూర్తి "ఛీ! పాడుపూరు" అనుకోలేదు.

ఉద్యోగం లేదు సరే. కాని, పూరంత పాడుగాలేదు.

మాంబళం బస్ టెర్మినస్‌దగ్గర కాఫీ హోటేల్లోకి చకచకా పోతున్నాయి రెండు సిల్కుచీరలు.

"పొడుగుటావిడ మోహినికాదుకద"అని పరిశీలించి చూసేడు. ఆవిడ మోహిన్లాలేదు. ఆవిడ మోహిని కాదు.

మోహిని మాంబళంలో ఉండదు. కాని, మైలాపూర్లో మాత్రం ఉంటుందని నిర్ధారణ ఏముంది?

ఇంతపట్నంలో ఆవిడ మళ్ళీ కనిపించడం అసంభవమేమో? మోహిన్ని సులభంగా వెతకడానికి వీల్లేకుండా మద్రాస్ నగరం తగుమాత్రం పెద్దదిగా అయినా ఉండడం మూర్తికి ఇష్టంలేకపోయింది.

"ఛీ! పాడుపూరు" అని మళ్లీ విసుక్కున్నాడు లజ్ కార్నర్లో దిగుతూ.

"హల్లో, మిస్టర్!" అంది ఎదురుగా పొడుగ్గా నిల్చున్న ఆడమనిషి.

మూర్తికి నవనాళ్ళూ లాగేసినట్టయింది.

ఒకేసారి మల్లెలూ మందారలూ పూసిన తీగలా నిల్చొంది మోహిని, తెల్లటిచీరతో, ఎర్రటిజాకెట్టుతో.

ముఖం కోలగావుంది. నడుం సన్నగా ఉంది. కన్ను పెద్దగా ఉంది. కళ్లకి కాటికుంది. సిగలో పువ్వు లున్నాయి. పెదవుల మీద నవ్వులున్నాయి. మనిషి ముచ్చటగా ఉంది.

"హల్లో! మళ్లీ కనిపిస్తా ననుకోలేదు. ఏమీ అనుకోకు నిన్న శ్రమ ఇచ్చినందుకు నీకు. థాంక్స్ మాత్రం తీసుకో, నాని" అంది ఇంగ్లీషులోనే, జోరుగానే.

'థాంక్స్' అనే మాట అర్థమయింది మూర్తికి.

"తెలుగుమనిషిలా లేదు" అనుకొంటోన్న మూర్తికి వీధిలో అంతా తమవైపే, చూస్తున్నట్టుగా తోచింది.

ఏ కాలేజీలో చదువుతున్నావని అడిగింది.

ఎక్కడా చదవనందుకు ఆ సమయంలో ఇదివరకన్నింటే ఎక్కువ బాధపడ్డాడు. ఇంగ్లీషులో జవాబు వెంటనే ఇచ్చే భాషా జ్ఞానం లేనందుకు కించపడి బాధపడ్డాడు.

మెల్లిగా ఒక్కొక్కమాటా వచ్చింది ఇంగ్లీషులో.

"నేను స్కూల్ ఫైనల్ పరీక్ష పాస్‌చేసి ఉన్నాను. నేను ఇప్పుడు కాలేజీలో చదువుచుండుట లేదు."

"అయితే ఈవూళ్లో ఏంచేస్తున్నట్టు?"

ఈవిడకి ఇంగ్లీషుతప్ప మరే భాషా రాదా!

ఎమ్మే చదువుతే నేనుకూడా పరపర లాడించేద్దును ఇంగ్లీషు ఈవిళ్ళాగే.

"నేను యీవూరు ఉద్యోగం నిమిత్తం వచ్చియున్నాను."

ముక్కముక్కకీ తడుముకోవాలి. దిక్కుమాలిన బాధ.

ఈ కుర్రవాడితో ఇంకేమిటి మాట్లాడ్డం అనుకోంటూన్నట్టుగా ముఖం పెట్టింది మోహిని. పెదవులమీద నవ్వుమాత్రం పోలేదు.

ఇద్దరూ మొహమాటపడుతూ అరనిమిషం నిల్చున్నాక ఆ అరనిమిషంలో అనవలసిన మాటలు తర్జుమా చేసికొని "అయిన యెడల నేను పోయెదను మరియు వచ్చెదను" అన్నాడు మూర్తి, పోడానికి ఎంతమాత్రం ఇష్టం లేకపోయినా.

ఆవిడ కళ్లలోకి చూడలేకపోయేడు. మెడవైపు చూసేడు. ఎడంచేతిలో పుస్తకం మీదకి కళ్ళు జార్చేడు.

మోహిని, V ఆనర్స్ క్లాస్, ఫలానా కాలేజీ అనే పదాలు నల్లటి అక్షరాల్తో నోట్‌బుక్ అట్టమీద రాసిఉన్నాయ్. ఏ కాలేజీలోచదువుతోందో తెలుసుకోడంతో మూర్తిలో సంతోషం చరచరా లేచింది.

"అయితే, ఛీరియో" అందామె.

ఏమనడానికీ పాలుపోక ఏదోయిదిగా నవ్వేసిన మూర్తిని "అడగడం మర్చిపోయేను. నీ పేరేమిటి" అని అడిగిందామె.

తన పేరేమిటో తెలుసుకోవాలనే కుతూహలం ఆవిడకి కలిగినందుకు మూర్తిలో ఈ సారి సంతోషం జరజర లాడింది.

"నా పేరు 'మూర్తి' అయివున్నది."

అని సుస్పష్టంగా ఇంగ్లీషులో చెప్పేడు గొప్పగా.

"ఫీరియో" అన్నదామె.
మూర్తి కూడా అదే అన్నాడు.
ఇంతలో వచ్చి నిల్చొన్న బస్సులోనికి ఎక్కింది మోహిని, సునాయాసంగా పది మందిని వెనక్కి నెట్టి.
పదిమందిమీదా చెప్పలేనంత కోపం వచ్చింది మూర్తికి. ఎగ్మూర్ వెళ్ళడానికి బస్సు ఎక్కుతూ తనో పన్నెండు మందిని తోసిపారేశాడు మోచేతులో.
ఆ రోజున మూర్తికి కోపం కలిగించిన వారి సంఖ్య అంతటితో ఇరవై రెండయింది.
పెద్దపెద్ద ఉద్యోగస్తుల్ని ఆశ్రయించడం అన్నివిధాలా మంచిదనేది మామయ్య చెప్పే సూత్రం.
ఆ సూత్రాన్ని ఆచరణలో పెట్టమని మేనల్లుడికి సదా ఉపదేశిస్తూ ఉంటాడు.
ఆ ప్రకారంగా ఎగ్మూరు వెళ్లి రామయ్యగారి కాళ్లు పట్టుకోమని బోధించి పంపించేడు మామయ్య.
రామయ్యగారి పిలక పట్టుకొందికి సందేహించని వాళ్ళా వెళ్ళి మాట్లాడేడు మూర్తి, ఆరోజున మోహిన్ని విడిచివెళ్ళక.
అదివరకు నలుగు రైదుగురు ఉన్నతోద్యోగుల్ని చూడ్డానికి వెళ్ళినప్పుడు వార్ని చూడ్డమే జరిగింది, కాని వారితో మాట్లాడ్డం జరిగింది కాదు. ఎందుచేత?
నోటంట మాట రాకపోవడంచేత?
మరయితే ఇప్పుడింత చురుగ్గా, సమాన ఫాయిదాలో ఇతన్తో ఎలా మాట్లాడుతున్నాను?
కారణం ఉంది. నాకా కారణం ఎంతో బాగా తెలుసు. ఏమిటది?
"కుర్రాడు చాలా చురుగ్గా ఉన్నాడే" అనుకున్నాడు రామయ్య. తప్పో ఒప్పో, ఇంగ్లీలో మాట్లాడుతే చాలు తరించిపోయే మనుకొనే జాతి రామయ్యది.
తప్పులున్నా సరే ఇంగ్లీషులోనే మాట్లాడాలని ఉబుకొనివచ్చి అలాగే ఇంటర్వ్యూ సాగిస్తున్నవాడు మూర్తి.
రామయ్య ఆఖరికి అన్నాడు.
"అబ్బాయ్. అప్లికేషన్ పంపించేశావు కద! ఏమయినా వీలుంటే చూస్తాన్లే. నాల్రోజులు పోయాక మళ్ళీ ఓసారి కనిపించు" అని.
"థాంక్యూ వెరీమచ్" అన్నాడు మూర్తి.
"బై ది బై. మీ 'అన్కుల్' ఎలా ఉన్నాడు?"
"హీ యీజ్...ఓకే"
ఓకే అంటే అర్థం?
తరువాత రామయ్య కుర్చీలోంచి లేచేడు. మూర్తికూడా లేచేడు.
రామయ్య ఇంట్లోకి పోయేడు. మూర్తి బైటకి వచ్చేడు.

T. P. 7404

మీకు నిశ్చయంగా శుభ్రమైన
రుచికరమైన ఆహారం
సమకూర్చునది

# పకావ్

తాతా వారు తయారుచేసినది.

అభివృద్ధిపరుపబడిన ఈ క్రొత్త పకావ్ ముద్దగా ఉండే అద్భుతమైన వచన సాధనం మాత్రమే కాదు — చపాతీల మీదగాని, రొట్టె మీద గాని పరచటానికి బహు అనువైనది.



ప్రభుత్వ ప్రమాణములకు పూర్తిగా అనువర్తిస్తుంది, కనుక మంచి ఫలితాల నిస్తుందని మీకు తెలుసును.

అప్యాయమైన భోజనానికి ఒక పకావ్ టిన్నును నేడే కొనండి.




తాతా ఆయిల్ మిల్సు కం. లి.

బైటకి వస్తూ "థాంక్యూ మోహినీ" అనుకున్నాడు ఎందుకో. సాయంకాలం ఇంటికివస్తూనే మామయ్య అడిగేడు:
"రామయ్యగా రేమన్నార్రా?"
"తన చేతిలో వున్న సాయం అంతా చేసి తీరుతానన్నాడు"
"నిజంగా, నిజంగా ???"
"నిజంగా, నిజంగా."
"రామయ్యగారలా అన్నార్రా?"
"అవును! అన్నాడు. నీ గురించికూడా భోగట్టా చేసేడు"
"నిజంగా, నిజంగా ????"
"ఎంతో నిజంగా నిజంగా"
"ఈ మామయ్యని చూసి ఇన్నాళ్ళూ ఎందుకు గడ గడ లాడేను?" అనుకున్నాడు మూర్తి.
మామయ్య తనలోతను నవ్వేసుకొంటూ,

# ★ మగవాడు - ఆడమనిషి ★

కోటు విప్పుకొంటూ అవతల గదిలోకి పోయేడు.

తరువాత, బాత్ రూమ్‌లోకి ముఖం కడుక్కోందికి వెళ్తోన్న వరహాల్ని పైటపట్టుకు లాగేడు మూర్తి.

"అమ్మ నాన్నా చూస్తే చంపేస్తారు. నీకో దండం బాబూ" అంది వరహాలు.

"మీ అమ్మ నాన్నా చూస్తే నాకేం భయం?"

"పోనీ, నీక్కాకపోతే. నాకు, ఒదిలెయ్ బావా" అని జాలిగా అడిగింది వరహాలు.

ఆ మాత్రం మగతనం ఆ పిల్లమీద ఆ పూటకి ప్రదర్శించి ఆ పాటికి వదిలిపెట్టేడు మూర్తి.

కాణీఖర్చు పెట్టకుండా పెద్ద పెద్ద భవంతులు గాల్లో కట్టేస్తూ మర్నాటి పొద్దుటా వెళ్ళేడు మైలాపూర్, సాయంకాలమూ వెళ్ళేడు, మైలాపూర్. ఆ రీతిగా మూడు రోజులు వెళ్ళేడు.

మోహిని కనిపించింది కాదు. నాలుగో రోజు 'ఫలానా' కాలేజీ దగ్గర పొద్దుటా సాయంకాలం కాసినా ప్రయోజనం లేకపోయింది. కళ్లు మాత్రం కాయలు కాచేయి.

కళ్లు కాయలు కాసినా, కొంచెం చీకటి పడినా, మెరీనావెంబడి శాన్థోమ్ వైపు నడుస్తూ, మోహినికోసం చూసుకొంటూ నడుస్తూ "ఆవిడ కనిపిస్తే కపాలేశ్వరుడికి కొబ్బరికాయ కొడతాను" అని మొక్కుకున్నాడు.

"ఉద్యోగంకోసం కూడా దేముడికి కొబ్బరికాయ కొడదామనుకోలేదు" అనుకొంటూ శాన్థోమ్ దగ్గర ఏదో సందులోకి మళ్లేడు. నాలు గడుగులు నడిచేడు.

ఆవిడ అక్కడే కనిపించింది, ఎదురుగా వస్తూ.

మోహినే మోహినే!

ఈ మోహిని నా మోహమును చూస్తుందా చూడదా? చూడకపోతే ఎలా? నా అంతట నేను పలకరించలేనుకదా ఎలా? హల్లో అనడమా? ఏమండీ అనడమా? మోహిని గారూ అనడమా? ఏం చేయడమేం చేయడం?

అని తీవ్రాతి తీవ్రంగా ఆలోచిస్తూ, బితుకూబితుకూ చూస్తోన్న మూర్తి మోహిని కంటపడ్డాడు.

మూర్తిని చూడగానే ఆమె ఓ పెద్ద నిట్టూర్పు విడిచింది. ఆమె ఓపెద్ద నిట్టూర్పు విడిచేక, కళ్ళలో సంతోషం ప్రకటించడం, తొందరగా ముందు కొచ్చి అతని రెండు చేతులూ పట్టుకోడం, అతను ఆనందంలో వణికిపోడం అన్నీ అటు తరువాత ఒక్కక్షణంలో జరిగేయి.

"*Thauk God*! సరిగ్గా సమయానికి కనిపించేవు" అని వూపిరి విడిచింది మోహిని.

ఊపిరి పీల్చడంకూడా మర్చిపోయాడా అన్నట్టుగా ఉండిపోయేడు మూర్తి.

ఈలోపున, పొట్టిగా ఒకడూ పొడవుగా ఒకడూ, సూట్లు తొడుక్కున్న వాళ్లిద్దరు, వాళ్ళని దాటి ముందుకు పోయేరు. ఇరుగ్గా లేని సందులో, కార్పొరేషన్ దీపాల కాంతిలో కొద్దిపాటి జనం నడుస్తున్నారు. పక్క ఇంట్లోంచి ఎవరో చూస్తున్నారు.

మోహిని దగ్గరగా నిల్చొంది. చేతులు వదల్లేదు.

"నాకు మళ్ళీ ఓ వుపకారం చేసి తీరాలి"

"చేసి తీరతాను" అని మనసులో ఆవెంటనే నిశ్చయం చేసుకొన్న మూర్తి "యస్ యస్" అన్నాడు.

"వెనక్కి చూడు" అంది మోహిని.

వెనక్కి చూసేడు మూర్తి.

వెనక్కి చూస్తే ఏముంది? ఏమీ లేదే!

"ఏమి? ఏమి?" అన్నాడు.

"కార్నర్లో వాళ్ళిద్దరూ నిల్చున్నారు చూడు."

"యస్ యస్."

పొట్టిగా ఒకడు, పొడవుగా ఇంకొకడు, నిల్చొని చూస్తున్నారు తమవైపు.

"నీకు ధైర్యం ఉందా?" అని అడిగింది మోహిని.

"యస్ యస్."

"అది బాగుంది. అయితే వెంటనే వెళ్లి వాళ్ళిద్దర్నీ చితక తన్ను."

"యస్ యస్" అనేశాడు, దేనికి 'యస్' అంటున్నాడో అర్థం చేసుకోకుండానే, జీవితంలో అంతవరకూ తన్నుల్ని తప్పించి మరెవర్నీ తన్నకుండానే.

సరే అనేశాక తెలిసివచ్చింది వాళ్ళని కొట్టమంటోందని. అప్పుడయినా, ఆమె ప్రవర్తన కొంచెం విపరీతంగా ఉన్నట్టు తోచలేదు.

ఉత్తరం పోస్ట్ చేయడం, పెద్దమనుష్యుల్ని పట్టుకు తన్నడం, అనే రెండు పనులకీ తేడా కనిపించలేదు మూర్తికి. అదెంతో ఇదీ అంతే. అది సాధ్యమైతే, ఇదీ సాధ్యమే!

"అయితే, వెళ్లు వేగిరం."

"ఏల? తన్నుట?" అని మాత్రం అడిగేడు.

"ఇందాకటినుంచీ 'ఫాలో' అవుతున్నారు. డర్టీ రాస్కెల్స్. వాళ్ళకి బుద్ధి చెప్తే నేగాని లాభంలేదు. వేగిరం, వేగిరం వెళ్ళి తన్ను."

వాళ్ళామెని అవమానిస్తున్నారనీ, వాళ్ళని చితగ్గొట్టవలసి వుంటుందనీ గ్రహించేడు మూర్తి.

మూర్తి కదిలేడు. వాళ్ళవైపు నడిచేడు. పళ్లు పటపట కొరుకుతూనే వున్నాడు.

అంతవరకూ బాగా జ్ఞాపకం ఉంది.

తరువాత ఏం జరిగింది?

వీరాభిమన్యుడు కదిలేడు. శత్రువుల్ని సమీపించేడు. నరాధములదగ్గర సెంటు వాసన వేస్తోంది. పగతురు పొగ వదుల్తున్నారు. తరువాత ఇంగ్లీషులో కీసుపాసులు. తెలుగులో ఒకటోరకం తిట్లు. బండబూతులు.

తరువాత?

తరువాత ఏమున్నది? గభీగభీ, కొట్లో, తన్నో, నరుకో, అడీ అడీ! అడిచిడు! కొట్టు! కొట్టు!

ఒకడూ, ఇద్దరూ! ముగ్గురి తన్నులాట!

తరువాత?

పొంగిన ఛాతీతో నిల్చొన్న మూర్తి పక్కన నిల్చొన్న మోహిని, ఎదురుగా నిల్చొన్న పోలీసు జవాన్‌తో గడ గడ గడ గడ ఇంగ్లీషులో చెప్తోంది. పోలీసువాడు ఏర్చి కూర్చిన పదాల్తో, అరవ బూతుల్తో వాళ్లతో చెప్తున్నాడు, వాళ్లని తిడుతున్నాడు. వాళ్లిద్దరూ వాజమ్మల్లా నిల్చున్నారు, విరగని ఎముకల్తో, చిరిగిన చొక్కాల్తో, తగిలిన దెబ్బల్తో.

తరువాత?

ప్రేక్షకులు వెంటవెళ్లగా వాళ్లిద్దరూ పోయేరు. ప్రేక్షకుల్ని తప్పించుకొందికి మోహిని తనని రిక్షాలోకి తోసింది.

తనూ ఎక్కింది.

తరువాత?

"నేనూ మోహినీ రిక్షాలో కూర్చు


## కొక్కొకము

ఇది ప్రాచీన కొక్కొకవాత్స్యాయుని గ్రంథము. స్త్రీ, పురుషుల ఫోటోలతో 150 పుటలు పుస్తకం వెల రు. 1-8-0 పోష్టుఖర్చులు 0-6-0.

జై హింద్ బుక్ డిపో,

60, అణ్ణాపిళ్లెవీధి-26 బీటు, మద్రాసు.

న్నాం" అనే విషయం గమనించ గలిగేడు మూర్తి.

పొట్టి వెధవా, పొడుగు వెధవా, పోయేరు. ఇవాళ రాత్రి చస్తారు. చావనీ.

ఇంగ్లీషులో ఏవేవో ముద్దు పేర్లలో పిలుస్తోంది మోహిని. పిలుస్తూ, మాట్లాడుతూ మధ్యలో ఆగింది.

ఆగి రెండు ముద్దులు పెట్టుకొంది మూర్తిని, ఈ బుగ్గమీద ఒకటీ, ఆ బుగ్గమీద ఒకటీ.

తరువాత మళ్లీ మాటలు.

ఆమె అలా ముద్దు పెట్టుకున్నందుకు మూర్తి ఆశ్చర్యపోలేదు. జరగవలసిన దేదో జరిగినట్టుగా భావించేడు.

ఇప్పుడు ఉండవలసింది అనిల్ కుమార్ గాడు! ఉంటే ఏం చేసేవాడు? దెబ్బలాటా ఉండకపోను. ఏమీ ఉండకపోను. ముందు తనే దౌడు తీసి తోక ముడిచేసేవాడు.

"రా. మోహినీ. వాళ్ళతో మన కేల? మన మానాన్న మనం పోదాం" అనే బాపతు అయివుంటుంది అనిల్ కుమార్ ది.

అంతే అంతే.

ఇంతలో రిక్షా ఆగింది, ఏదో డిస్పెన్సరీ ముందు.

దిగుతూంటే వళ్ళు నొప్పిగా ఉంది.

డిస్పెన్సరీలో టించర్ అయొడిన్ రాస్తూంటే బాగా తెలివొచ్చింది.

కంపౌండర్ కి మోహిని డబ్బు ఇస్తూంటే,

"ఒద్దొద్దు. నే నిస్తాను" అనగలిగేడు మూర్తి.

"వద్దూ, వద్దూ నాన్ ఇస్తానూ" అంది మోహిని, ఒక్కమాట మినహాయించి తెలుగులో పట్టిపట్టి మాట్లాడుతూ, నవ్వుతూ. తరువాత డిస్పెన్సరీలోంచి బైటికి వస్తూ.

"మీరు ఆంధ్రాస్ కారా?" అని ప్రశ్నించేడు మూర్తి.

"నో" అంది మోహిని.

ఆవిడ తెలుగుమనిషి కానందుకు కొంచెం విచారించేడు.

ఇంగ్లీషుమాట కొంచెం జోరుగానే వస్తోంది.

"మీ రేమిటి చదువుతున్నారు?"

"నేనా? హిస్టరీ ఆనర్స్. ఫైనలియర్."

'V ఆనర్స్ అంటే ఆఖరేడాదన్న మాట' అనుకున్నాడు మూర్తి.

ఆనర్స్ చదవని జీవిత మేల? అని వ్యధ చెందేడు.

అంతటితో మూర్తికి మోహిన్ని తప్పించి ఆనర్సు చదువుతున్న వా రందరిమీదా డబ్బున్న వాళ్ళందరిమీదా, లోకంలో చాలాభాగంమీదా ఎంతో కోపంవచ్చింది.

ఆ సమయంలో పొట్టిగా పొడవుగా ఉన్న వారిద్ద రెవరయినా కనిపించినట్లయితే కొంచెం ప్రమాదం సంభవించేది.

"నిన్నెలా 'థాంక్' చెయ్యాలో తెలియకుండా ఉంది" అంది మోహిని నిల్చుండిపోతూ.

మూర్తి కూడా ఆగేడు.

పక్కనే పెద్దగేటు. గేటుమీద పువ్వుల పందిరి. లోనికి పోతోన్న రోడ్డు. రోడ్డుకి రెండుపక్కలా చెట్లు. వెనక ఎక్కడో వెలుగుతోన్న దీపాల్లో భవన్తి ఉన్న సూచన.

"ఇదే మా హాస్టలు."

"యస్ యస్"

"మళ్ళీ రేపోసారి రావూ?"

"యస్ యస్"

మోహిని, వెనక్కీ ముందుకీ, చుట్టూ చూస్తోంది, అదోలా ముఖంపెట్టి. పొట్టీ పొడుగూ మళ్ళీ వస్తున్నారా? అనుకున్నాడు మూర్తి. లేదు. వాళ్లు రావడం లేదు.

అయితే, ఎందుచేత అలా చూస్తోంది మోహిని?

జవాబు వెంటనే వచ్చింది.

ఒక్కసారి, అకస్మాత్తుగా, అతని మెడ చుట్టూ చేతులు వేసి పెదవులమీద తన పెదవులాన్చి, అంతవేగిరంగానూ వదిలి వెనక్కిపోయింది. మోహిని.

కొంచెం దూరం వెళ్లేక "రేపు సాయంకాలం తప్పక రావాలి" అంది.

"యస్, యస్, యస్" అన్నాడు మూర్తి.

అతిక్షణంలో కనిపెట్టగలిగేడు.

వరహాలెలా వణుకుతుందో మోహిని కూడా అలానే వణికింది. ఇలాటి విషయంలో ఇద్దరాడవాళ్ళమధ్యా తేడా లేదు.

మూర్తి కొంచెం గర్వంగా అక్కణ్ణించి కదిలేడు.

ఇంటికి వెళ్ళేసరికి చాలా రాత్రయింది.

ఇంట్లో అంతా గాభరా పడ్డారు.

వాళ్లలా గాభరా పడ్డందుకు చాలా సంతోషించేడు మూర్తి.

"ఏమిరా, దెబ్బ లెలా తగిలేయ్ రా? ట్రాములోంచి కాని పడ్డావా? ఏమిటి సంగతి? మాట్లాడవేం?" అని మామయ్య ఆందోళనతో అడిగేడు.

ఎక్కువబాధ నటిస్తూ "హిస్" అంటూ వాలుకుర్చీలో కూలబడ్డాడు మూర్తి.

"చెప్పరా? చెప్పవేం? బాగా నొప్పిగా ఉందా? ఆస్పత్రికొక్కని వెళ్ళాల్సుందా? వేగిరం చెప్పు" అన్నాడు మామయ్య.

అందుకు సమాధానంగా "మరేం ఫర్వా లేదు. మీ గాభరా చూస్తే నవ్వొస్తోంది" అన్నట్టు కొంచెం నవ్వి "వరహాలూ, మంచి నీళ్ళుతే" అన్నాడు మూర్తి.

"తేవే, తేవే" అన్నాడు మామయ్య.

తెచ్చింది వరహాలు.

గళాసు చేతికి అందిస్తున్నప్పుడు తన కాల్తో ఆమె కాలు నొక్కేడు మూర్తి.

తరువాత ఓ కథ చెప్పేడు:

టెర్మినస్ దగ్గర బస్సులోంచి తను ఎలా దిగినదీ, అప్పణ్ణించీ ఎవరో వెంటాడుతున్నట్టు ఎలా అనుమానించినదీ, నిజంగా ఎవరో ముగ్గురు ఎలా వెంటాడినదీ, చీకటి సందులోకి రాగానే జేబులో పర్సుకోసం తనని వాళ్ళు ఎలా ఆపినదీ, ఆపగానే

(56-వ పేజీ చూడండి)

నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిక్కాక, నిస్సత్తువ, శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 8-4-0 పోస్టేజి 12 అ.

పి. సి. ఏ. &కంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి- నెల్లూరు జిల్లా.

ఒక గంటలో యౌవ్వనము

కామస్తంభన

ధాతుపుష్టి, సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది విరాళచెందిన వృద్ధులయందు శక్తి. ఉత్సాహము నిచ్చును. రు. 2-8-0.

మదన మంజరి ఫార్మసీ

184, వైనాలబజారు రోడ్డు. మద్రాసు.

బెజవాడ-శ్రీనివాస మెడికల్ స్టోర్సు-పార్కురోడ్డు

రాజమండ్రి-ఈశ్వరదాస్ & కో. మెయిన్ రోడ్డు

వెల్లూరు:- ఆర్యన్ ఫార్మసీ-ట్రంకురోడ్డు

ఇతర కేంద్రాల్లో ఏజెంట్లు కావాలి

కుష్ఠు ★ బొల్లి

తగ్గిరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

## ★ మగవాడు - ఆడమనిషి ★

(11-వ పేజీ తరువాయి)

మొదటివాడి కడుపులో పిడికిలితో తను ఏ రీతిగా పొడిచినదీ, కొంత దెబ్బలాట అయాక రెండోవాడి ముక్కుమీద ఏ విధంగా గుద్దినదీ, తరువాత ముగ్గురూ ఎలా పారిపోయినదీ, ఇంతలో తనని ప్రజానీకం చుట్టుముట్టి తనని అభినందించి, కట్టుకట్టించి సగౌరవంగా తనని ఎలా సాగనంపినదీ—

అంతా, కథంతా, జరిగినట్టుగా, చిన్న చిన్న డీటేల్సుతో కూడా చెప్పేడు.

మామయ్య ఆశ్చర్యపడి సంతోషించేడు.

"నేనయితే ఈకటు కథ నమ్మను" అని అత్తయ్య నోటితో చెప్పలేదు.

వరహాలు గర్వంతో, ఆనందంతో పొంగి పట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

"ఆపిన వెంటనే పోలీసువాళ్ళకోసం కేకలు వెయ్యలేకపోయావురా?" అన్నాడు మామయ్య అంతా విన్నాక.

"అది నీలాటి వాడు చేసేపని" అన్నట్టుగా చూసేడు మూర్తి. తరువాత, బాగా రాత్రి అయాక, మెలకువగా ఉండే ఏదో పలవరిస్తున్నట్టుగా "వరహాలూ, వరహాలూ" అని కేకలు వేసేడు మూర్తి.

"వరహాలకోసం పలవరిస్తున్నాడే. దాన్ని పెళ్ళి వాడి దగ్గరకూర్చోపెట్రాదూ" అంటున్నాడు పక్క గదిలో మామయ్య.

అత్తయ్య ఏదో గొణిగింది.

"ఫరవాలేదే. కావలిస్తే నవ్వ్వాఅక్కడే ఉండు"అన్నాడు మామయ్య ఆమెతో.

అంతవరకూ గాఢనిద్రలో ఉన్నట్టు నటిస్తోన్న వరహాలు కళ్ళు నులుపుకొంటూ అవతల గదిలోంచి వచ్చి మూర్తి మంచం పక్క కుర్చీలో కూర్చొంది. అత్తయ్య శాపవేసుకు పడుకొంది.

చీకట్లో వరహాలు చెయ్యిపట్టుకున్నాడు.

త్రిష్ణ అంతా ఆ రెండు చేతుల్లోనూ ఉంది.

తెల్లారుతూందనగా నిద్ర పట్టింది. మధ్యాహ్నం తెలివొచ్చింది.

ఒళ్లంతా బరువుగా ఉన్నా మనసెంతో తేలిగ్గా ఉంది.

"ఏరా ఎలా ఉంది" అని అడిగింది అత్తయ్య.

"సినీమాకి వెళ్ళాలనుంది" అన్నాడు మూర్తి.

ధుమధుమ లాడుతూ అత్తయ్య గది లోంచి వెళిపోయింది.

కలకల్లాడుతూ వరహాలు గదిలోకి వచ్చింది.

ఆకుపచ్చ చీరకట్టుకుంది. కోరచూపులు కళ్లలో పెట్టుకుంది.

"ఓహో! చాలా ఫస్టుగ్గా ఉన్నావే! ఏదీ ఇలా వచ్చి ఓముద్దియ్" అన్నాడు మూర్తి ఆమెని చూడగానే.

అత్తయ్యకి వినిపించవా నా మాటలు! అనుకున్నాడు.

"శ్! మెల్లిగా మెల్లిగా! అమ్మ వినగలదు"అంది వరహాలు మెల్లిగా, కోపంగా.

నేనో ఆడదాన్ని గెక్కపట్టుకు లాక్కొచ్చేను అందరూ తెలుసుకోవచ్చు—

అని చాటించాలనే మొగవాడి మనస్తత్వం వరహాలుకి అర్థం కాలేదు.

"బావకి గుట్టు ఉంచాలని లేదు. ఛీ!" అనుకొంది.

"అమ్మ విన్నా భయం లేదు. అమ్మమ్మ విన్నా భయంలేదు. పెళ్ళయాక కూడా ఇలాగే అంటావు కాబోలు" అన్నాడు మూర్తి.

వరహాలు ఏడుపు ముఖం పెట్టింది.

"ఏడవకు ఏడవకు నా చిట్టి తల్లీ" అన్నాడు మూర్తి. వరహాలు వెళిపోబోయింది.

"చూడూ! ఇవాళ రామయ్య దగ్గరకి వెళ్ళాలి. పెట్లోంచి నా బట్టలూ అవీ తీసి సిద్ధంగా ఉంచు. నే ముఖం కడుక్కొనే లోపున" అని ఆజ్ఞ విసిరేసు.

"సిద్ధంగా ఉంచను" అంది వరహాలు వెళిపోతూ.

అంటే సిద్ధంగా ఉంచి తీరుతుందన్న మాట, అని లేచేడు మూర్తి.

"థాంక్యూ మోహినీ!" అనుకున్నాడు ఓసారి.

సాయంకాలం రామయ్యతో కూడా తన కట్టుకథ చెప్పేడు.

"*I am no end pleased with you*" అన్నాడు రామయ్య. మూర్తి పెట్టిన అప్లికేషన్‌మీద ఉద్యోగం ఇస్తూ ఆర్డర్సు వేశారనీ, కమ్యూనికేషన్ వస్తుందనీ కూడా చెప్పేడు రామయ్య.

అక్కణ్ణించి వస్తూ "నా క్కాకపోతే ఇంకెవడి కిస్తాడు ఉద్యోగం! థాంక్యూ మోహినీ!" అనుకున్నాడు మూర్తి.

ఎగ్మూర్ నుంచి ఇంటికి వచ్చేసరికి సాయంకాలం ఆరయింది. మోహిని దగ్గరికి వెళ్ళడానికి ఇంకో క్రొత్త డ్రెస్ వేసుకు తీరాలి.

ఇంటికి వచ్చి చెప్పేడు ఉద్యోగం విషయం.

ఆ సంగతి వినగానే—

మామయ్య పెద్దవాడు కాబట్టి గెంతులు వెయ్యలేదు.

అత్తయ్య సంతోషించకుండా ఉండలేక పోయింది, మామయ్య పెళ్లాం కాబట్టి.

వరహాలు కళ్ళతోటే కావిలించుకొంది, పక్క అంతా ఉన్నారు కాబట్టి.

"రామయ్యగారు ఎంత మంచివాడ్రా!! ఆయనకి మన థ్యాంక్సు ఎలా చెప్పడమో ఏమిటో నాకు తోచకుండా ఉంది" అన్నాడు మామయ్య.

రామయ్యకి కాదు థాంక్సు.

మోహినికి థాంక్సు!

మోహిని కెందుకు థాంక్సు?

మోహినికే థాంక్సు!

అనుకున్నాడు మూర్తి.

ఇంట్లో ఉన్న అయిదు నిమిషాల్లోనూ వీలు చూసుకొని అయిదుసార్లు ముద్దులాడేడు వరహాల్ని. వీలు చూసుకొంది వరహాలు

కొత్తబట్టలు వేసుకొని. ఇంటిగుమ్మం దిగుతూంటే "చీకటి పడిపోతోందిరా కుర్రాడా! ఇప్పుడు వెళ్తున్నా వక్కడికి?" అన్నాడు మామయ్య.

"'కుర్రాడా' అని పిలవకు మామయ్యా" అన్నాడు మూర్తి.

తరువాత నాలుగురోడ్ల జంక్షన్ దగ్గర బస్ టెర్మినస్ రోడ్డుకి మళ్ళి, విసురుగా నడిచేడు, నిండు యవ్వనపు గర్వంతో టీవితో. ★

**అబలసుధ**

స్త్రీల కుసుమ వ్యాధులు అకాల హిష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ కాళ్ల లాగుట, మనస్థిమితము లేకపోవుట. నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టిరియా మొ॥ హరించును.

సీసా రు. 3/- వి. పి. అ 0-14-0.

ఇండియన్ మెడికల్ హౌస్,

లక్ష్మి టాకీసు రోడ్డు - విజయవాడ-2

**వెలుగు మబ్బులు**

ఫోటో: ఓ. సి. యమ్. ఈశ్వరబాబు

—మద్రాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu ChettySt, Madras